


# ఒక్క క్షణం

ఆచంట శారదాదేవి

మళ్ళీ వచ్చింది దీపావళి మరొకసారి. దీపావళి వచ్చిందంటేనే పిల్లలందరికీ సంతోషం. కొత్త బట్టలు స్వీట్స్, టపాకాయలు, అన్నింటికన్నా ముఖ్యంగా ఆదివారం కూడా కలిసి వస్తే మూడు రోజులు సెలవులు. వీరికి ఆడుకోడానికి, పెద్దవాళ్ళకూ సంతోషంగా ఉంటుంది. మూడు రోజులు పండగ సంబరం, తీరికలేని పని. మామూలు వాతావరణంలో నుంచి కాస్సేపు మార్పు, ఆనందం. ఖర్చులదేమున్నది. 'ఎప్పుడూ ఉన్నదే గదా! ఎలాగో జరిగిపోతూంటుంది. పండగలు వస్తూపోతూ ఉన్నట్లే ఖర్చులు వస్తూ పోతూ వుంటాయి.

సౌభాగ్యమ్మ శంకరావు ఇద్దరూ సంతోషంగానే ఉన్నారు, పండగ వస్తోంది అని. విశేషం ఈసారి వారి ముగ్గురు అమ్మాయిలూ పండగకు వస్తున్నామని రాశారు వీరు ప్రత్యేకంగా రమ్మని రాయకపోయినా, పోయిన సంవత్సం ఎవరూ రాలేదు! అందరూ ఏదో పనులు ఉన్నాయని అభ్యంతరాలు చెప్పి దాటేశారు, రమ్మని రాసినా! ఈసారి శంకరరావు ఈ సంవత్సరమైనా వస్తారో రారో చూద్దాము అని అని రమ్మని రాయకుండా తాత్సారం చేశాడు. కాని ఈలోపల 'పిల్లలు వెళదామంటున్నారు వస్తున్నాం అని అధి సౌభాగ్యమ్మకూ, శంకరరావుకు ఇద్దరికీ సంతోషంగా ఉంది. మూడు రోజులు ఇల్లు సందడిగా ఉంటుంది. కూతుళ్ళతో, మనుమలతో! కాస్త ఒంటరితనానికి, చీకూ చింతా లేకుండా ఒకే రకంగా రోజులు గడుస్తూ, వాడుకబడిన జీవితానికి కాస్త విరామం!

శంకరరావు బ్యాంకులో ఉద్యోగం చేసి ప్రస్తుతం రిటైరై హాయిగా ఇంట్లో కాలక్షేపం చేస్తున్నాడు. ఆర్థికంగా ఏమీ లోపం లేదు. బాధలు లేవు. ఉద్యోగం చేస్తూ ఉన్నప్పుడే ఎప్పుడో రిటైరు కాక తప్పదని అప్పుడు కూడా జీవితంలో ఏ లోపమూ లేకుండా ఇప్పటిలాగే జరగాలని ఆలోచిస్తూ డబ్బు ఆదా చేస్తూనే వున్నాడు. అందుచేత ఖర్చుల లోపం లేకుండా డబ్బు అందుబాటులోనే ఉంటోంది. రిటైరు అయిన తరువాత మళ్ళీ ఏదైనా ఉద్యోగం చేసుకుందామని ఎప్పుడూ ఆలోచించలేదు. ఆ ప్రయత్నమూ చెయ్యలేదు. చేసినన్నాళ్ళు చేశాము చాలు, ఇప్పుడింక తీరికగా సుఖంగా ఉందాము అనుకున్నాడు. మనస్సుకు, శరీరానికి రెండింటికీ శ్రమ లేకుండా ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా జీవితం గడుపుకుంటున్నాడు. ప్రొద్దునే లేచి వాకింగ్‌కని బయలుదేరి ఒక గంటసేపు త్రోవలో తెలిసిన వాళ్ళనందరిని పలకరిస్తూ కబుర్లు చెపుతూ కొత్తగా కడ్తున్న ఇళ్ళను మనుష్యులను చూస్తూ కాలక్షేపం చేసుకు వస్తాడు. ఆ తరువాత స్నానం చేసి కాస్సేపు పూజ చేసుకుని పేపర్లు పట్టుకు కూర్చుంటే టైమ్ అలా గడచిపోతూ ఉంటుంది. పది గంటల ప్రాంతంలో సౌభాగ్యమ్మ భోజనానికి పిలుస్తుంది. ఆ కార్యక్రమం ముగింపుకు వచ్చేటప్పటికి పదకొండు కావస్తూ ఉంటుంది. అప్పుడు ఆవిడ మహిళా సమాజానికని బయలుదేరి వెళ్ళిపోతుంది. ఇంట్లో తను మాత్రం మిగులుతాడు. కాస్సేపు చదువుకుంటూ, కాస్సేపు పోస్టు వస్తే చూచుకుంటూ జవాబులు రాయాల్సి వుంటే రాస్తూ కాలం గడుస్తూ ఉంటుంది. మూడు దాటుతూ ఉంటే సౌభాగ్యమ్మ పని మనిషి ఇద్దరూ ముందూ, వెనకగా కలిసే వస్తారు. మళ్ళీ కాఫీ, టిఫిను, కబుర్లు, సాయంత్రం ఆరు అవుతూ ఉంటే అలా దగ్గర్లోనే ఉన్న పార్కుకు బయలుదేరి వెళతాడు. అక్కడ చెట్లు ఎక్కువ లేవు. ఉన్నవి కాస్త ఎండిపోయే వున్నాయి. అక్కడ ఉన్న ఒక్క తోట మాలి ముసలివాడు. వానలు లేక నీళ్ళు లేక చెట్లు ఎలా ఎండిపోతూ ఉన్నదీ చెబుతూ ఉంటాడు. ఏమీ జరక్కపోయినా చెప్పుకోవడం వల్ల వాడికి కొంచెం మనశ్శాంతి, మనకు కొంచెం కాలక్షేపం.



ఇలా రోజూ క్రమం తప్పకుండా రోజులు ఒకేలా గడుస్తూ ఉండడం

శంకరరావుకేమీ అసంతృప్తిగా లేదు. అతనికి అదే బాగుంది. దూరాన ఉన్న ముగ్గురు కూతుళ్ళను గురించి కూడా అతను ఎప్పుడూ ఎక్కువగా ఆలోచించటం లేదు. దిగులు పడడం లేదు. ఉన్నంతలో ముగ్గురికీ మంచి సంబంధాలే చేశాడు. ముగ్గురు అల్లుళ్ళు మంచి ఉద్యోగాలలోనే ఉన్నారు. ఇంక వాళ్ళను గురించి ఆలోచించటానికేమి ఉంది! ఏదో వాళ్ళ సంసారం వాళ్ళ బాధ్యతలు వాళ్ళకున్నాయి. సుఖంగానే వున్నారు. ఎప్పుడూ కాకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు వస్తూనే ఉన్నారు. అందరూ కలిసి ఉంటూనే ఉన్నారు. వరుసగా ముగ్గురు అమ్మాయిలు పుట్టాక ఇంక చాలని తనే ఫుల్‌స్టాఫ్ పెట్టుకున్నాడు. ముగ్గురినీ పెంచి పెద్ద చేశాడు. పెళ్ళి చేశాడు. తన వంతు బాధ్యత సవ్యంగానే తీర్చుకున్నాడు.

పెద్ద అమ్మాయి సురేఖ బి.ఏ. వరకు చదివింది. దానికి ఇద్దరు కొడుకులు. రెండవది సుశీల ఇంటర్‌తోనే చదువు ముగించుకుంది. పెళ్ళి చేసుకుంది. దానికి ఒక్కతే కూతురు. మూడో పిల్ల శమంతకు పెళ్ళి అయి ఐదారేళ్ళు మాత్రమే అయింది. దాని కొడుకింకా చిన్నవాడే. ఏ విషయంలోనూ కొరత పెట్టుకోకపోయినా, శంకరరావుకు ఒక్క విషయంలో మాత్రం అప్పుడప్పుడూ కొరతగా అనిపిస్తూ వుంటుంది. అతను సొంతంగా ఇల్లు కట్టుకోటానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. అసలు దానిని గురించి ఆలోచించనూ లేదు. బహుశా కారణం ఏ బాధలూ లేకుండా ఇప్పుడున్న ఇల్లు తమకు అన్నివిధాల సొంత ఇల్లులాగా ఉండటమే కావచ్చు. ఈ ఇంట్లోనే ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్నారు. అవసరమైతే చిన్న చిన్న రిపేర్లు తనే చేయించుకుంటున్నాడు. ఇంటి యజమాని ఎక్కడో దూరాన రాజస్థాన్‌లో ఉన్నాడు. ఎప్పుడూ రాడు. అద్దె పెంచమని అడగడు. అతను చాలా ధనవంతుడో, లేదా చాలా మంచివాడో, రెండూ కావచ్చు. తను ఇంటికేదైనా రిపేర్లు చేయించినప్పుడు ఇలా చేయించానని శంకరరావు రాస్తాడు. చాలా సంతోషం మా ఇల్లు బాగా చూచుకుంటున్నారు అని ఆయన రాస్తాడు. అంతటితో సరి. బహుశా బాధలు లేకపోవడం చేతనేమో సొంత ఇల్లు కట్టుకోవాలన్న తొందర ఎప్పుడూ కలుగలేదు. అది అలా పోయింది. ఇంక ఇప్పుడు దానిని గురించి ఆలోచించి ప్రయోజనం లేదు. ఇప్పుడు ఇంక ఇల్లు కట్టడానికి ఓపిక, డబ్బూ రెండూ లేవు. కాలం గడుస్తూ వుంది.

శమంత కూడా పెళ్ళి వెళ్ళిపోయాక సౌభాగ్యమ్మకు ఇంట్లో పని తగ్గిపోయింది. కాలక్షేపం కష్టమైంది. శంకరరావుతో ఎంతసేపని మాట్లాడుతుంది? ఏం మాట్లాడుతుంది? అతనైతే ఏదో పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటాడు టైము తెలియకుండా! కాని తనకు అలవాటు అంతగా లేదు. ఇరుగూ పొరుగూతో కూడా మితంగా తప్ప అతిగా మాట్లాడటం ఎప్పుడూ లేదు. అయినా సరిగ్గా సమయానికి మహిళా సమాజం ప్రెసిడెంట్ రంగనాయకమ్మ తనను వెతుక్కుంటూ వచ్చి పిలిచింది. "ఖాళీగానే ఉన్నట్టున్నారు గదా. రోజూ వచ్చి మా సమాజంలో నేర్చుకోటానికి వచ్చే అమ్మాయిలకు కుట్టు పనులు, ఎంబ్రాయిడరీలు, అల్లికలు, ఇంకా ఉసిరిగాయలు, అప్పడాలు, వడియాలు పెట్టడము, ఇలా స్వయం ఉపాధికి ఉపయోగించే పనులన్నీ నేర్పవచ్చును గదా! అన్నీ మీకు బాగా తెలిసినవే గదా! ఊరికే కాదులెండి. మేమూ ఏదో కొంత నెల నెలా పారితోషికంగా ఇస్తూనే ఉంటాం. ఏమంటారు?"


సౌభాగ్యమ్మకు ఇది బాగానే ఉన్నట్లు తోచింది. ఇవన్నీ తనకు తెలియని పనులేమీ కాదు. ఇదివరకు మహిళా సమాజంలో ఎగ్జిబిషన్‌లు పెట్టినప్పుడు తను కూడా తను తయారుచేసిన ఎంబ్రాయిడరీలు, ఉసిరిగాయలు, వడియాలు అన్నీ ఎగ్జిబిషన్‌లో పెట్టింది. అప్పుడు అవి అందరూ చాలా బాగున్నాయని కొనుక్కున్నారు. ఆ జ్ఞాపకంతోనే రంగనాయకమ్మ ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది. సమాజం కూడా ఇంటికి దగ్గరగానే ఉంది. వెళ్ళడం రావడం కష్టమేమీ లేదు. తనకు కొంత కాలక్షేపం, కొంత సమాజ సేవ, కొంత పారితోషికం అన్నీ ఏర్పడతాయి. బాగానే ఉంటుంది. సౌభాగ్యమ్మ వెంటనే ఒప్పుకుంది. శంకరరావు అభ్యంతరం చెప్పలేదు. అలా శమంత పెళ్ళి అయిన తరువాత సౌభాగ్యమ్మ సమాజంలో ఒక భాగంగా మారిపోయింది. రోజూ మధ్యాహ్నం వెళ్ళడం రావడం మామూలైంది. ఆవిడకి ఇప్పుడు ఎంతో మంది పరిచయమవుతున్నారు. పని ; 'గానే వుంటుంది.

అప్పుడప్పుడూ ఎగ్జిబిషన్‌లు పెట్టినప్పుడు పని ఎక్కువగా ఉన్నా అన్నీ ఎంతో బాగా చెయ్యాలని ఎంతో ఉత్సాహంగానూ ఉంటోంది. రోజులు గడుస్తున్నాయి.

పండగ ఇంకా వారం రోజులు ఉండగానే శంకరరావు, సౌభాగ్యమ్మ బజారుకి వెళ్ళి అందరికీ బట్టలు కొని తెచ్చారు. అల్లుళ్ళు వస్తారో రారో సరిగా తెలియదు. అయినా బట్టలు మాత్రం కొన్నారు. శంకరరావు ఆలస్యం అవుతే ధరలు పెరుగుతాయని టపాకాయలు తగు మాత్రంగా కొన్నాడు. దంపతులిద్దరూ పండుగకు కొంచెం ముందుగానే అన్నీ సిద్ధం చేసి ఉంచుకున్నారు, అప్పుడు తొందరపడకుండా.

శని ఆదివారాలు కలిసి రావడం చేత అమ్మాయిలందరూ పండుగకు రెండు రోజులు ముందుగానే వచ్చేశారు పిల్లలతో. అల్లుళ్ళు ఎవ్వరూ రాలేదు ఏవో పనులు ఉన్నాయని చెప్పి. పండుగ ముందు సౌభాగ్యమ్మకు కొంచెమైనా తీరిక లేకుండా ఉంది పని, మహిళా సమాజంలో. ఇంచు మించు రోజంతా అక్కడే గడపాల్సి వస్తోంది. ఆనవాయితీగా సమాజం వాళ్ళు ప్రతి సంవత్సరం దీపావళి ముందు ఎగ్జిబిషన్ జరుపుతారు. ఎక్కువగా అన్నీ తయారుచేసి, ఈసారి పండుగకు స్వీట్స్ కూడా తయారుచేసి అమ్మితే బాగుంటుందని అవీ చేశారు. ఈ పనులతో అక్కడ ఎగ్జిబిషన్ చూసుకోడంతో సౌభాగ్యమ్మకు కూతుళ్ళు వచ్చినా ఇంట్లో ఉండటానికే వీలు పడలేదు. అయినా వాళ్ళు ఏమీ బాధపడలేదు. తల్లికి శ్రమ లేకుండా పనులు వాళ్ళే చేసుకున్నారు. పండగకు కావల్సిన పిండి వంటలు కూడా తయారుచేశారు. పండుగకు ముందు రోజే ఇల్లు కడిగి ముగ్గులు పెట్టారు. తోరణాలు కట్టుకున్నారు. సౌభాగ్యమ్మ తన ఇంట్లోనే తను అతిథిగా మారిపోయింది. ప్రొద్దున వెళితే సాయంత్రం వస్తూన్నా సురేఖ, సుశీల, శమంత ఏమీ అనుకోలేదు. తల్లిని సంతోషంగా ఉంచడమే తమ ఏకైక ధ్యేయం అన్నట్లు మసలుకున్నారు.

పండుగకు ముందు రోజు ఎగ్జిబిషన్ ముగించేశారు. ఆ రాత్రికి



## కాలానికి నిలిచిన ప్రేమ

'ప్రేమికుల్ని లోకమంతా 'ప్రేమిస్తుంది' అనేది ఆంగ్ల నానుడి. నిజంగా అంతా మెచ్చుకోదగ్గ ప్రేమికుడు రెగ్ పాటర్. పద్దెనిమిదేళ్ల రెగ్ 1935లో ఇంగ్లండ్‌లోని ఓ పొలంలో సైకిల్ మీద వెళ్తూన్న పదహారేళ్ల రోజ్‌ని చూసి ప్రేమలో పడ్డాడు. ఐతే, తన ప్రేమని ఆమెకి తెలియజేసేలోగానే, ఆమెకి మరొకరితో వివాహమైంది. అంతకుముందు రెండేళ్ల పాటు, వారానికి రెండుసార్లు రెగ్ ఆమెని కలసినా తమ వివాహం గురించి ప్రస్తావించే ధైర్యం చేయలేకపోయాడు. రోజ్ వివాహానంతరం రెగ్ అవివాహితుడు గానే యాభై ఆరేళ్ల పాటు జీవించాడు. 1991లో రోజ్ భర్త చనిపోయాక ఏడాదిపాటు డేటింగ్ చేసి 1992లో రోజ్ - రెగ్‌లిద్దరూ వివాహం చేసుకున్నారు.

- డి. పద్మజ

సౌభాగ్యమ్మకు ఖాళీ దొరికింది, కాస్త విశ్రాంతిగా కాలం గడపటానికి. తల్లీ కూతుళ్ళు అరుబయటనే కూర్చొని అర్ధరాత్రి వరకు కబుర్లు చెప్పుకున్నారు.. పిల్లలు నిద్రపోయారు. శంకరరావు అపురూపంగా అర్ధరాత్రి వరకు టి.వి.లో సినిమా చూశాడు. అది అతనికి దీపావళి స్పెషల్ కాబోలు! మొత్తానికి ఆ రాత్రి అందరి మనస్సులు ప్రశాంతంగా, సంతోషంగా ఉన్నాయి. ఎవరికి నిద్ర మీద ధ్యాస లేదు.

మర్నాడు ఉదయం వంటంతా సౌభాగ్యమ్మే చేసింది. తొందరగానే పూర్తిచేసింది. అందరికీ కొత్త బట్టలు ఇచ్చింది. అల్లుళ్ళ బట్టలు కూడా వాళ్ళ చేతికే ఇచ్చింది. అందరూ కట్టుకున్నారు.

మధ్యాహ్నం 12 గంటలకు భోజనాలు పూర్తయ్యాక అందరూ హాయిగా హాల్లో కూర్చున్నారు. కాలక్షేపానికి శంకరరావు తీరికగా పడక కుర్చీలో కూర్చున్నాడు, ఆవేళ పేపర్లతో పాటు వచ్చిన దీపావళి స్పెషల్స్ అన్నీ తిరగేస్తూ. అలవాటు లేకపోయినా సౌభాగ్యమ్మ తక్కిన ముగ్గురూ తమలపాకులు వేసుకోటానికి ప్రయత్నిస్తున్నారు, పండగ కదా అని. పిల్లలు వాకిట్లో చేరి వాళ్ళ గొడవలో వాళ్ళు ఉన్నారు.

హటాత్తుగా సుశీల అన్నది "అమ్మా! ఈ సంవత్సరం నీ ఇన్సూరెన్సు డబ్బు వస్తుంది గదమ్మా! నీ మనమరాలికి ఒక నెక్లెస్ చేయించి పెట్టు. అది చాలా రోజులుగా అడుగుతోంది" అని. ఎక్కడ ఆలస్యమైపోతుందేమో నని పెద్ద కూతురు సురేఖ అందుకుంది. "అవునమ్మా' నా కొడుక్కు ఇప్పుడేమో మోపెడ్ కావాలిట. అది కూడా నువ్వే కొనిపెట్టాలి" అంది నవ్వుతో. శమంత ఇంకా కొంచెం నవ్వుతూ అన్నది. "నా కొడుకు ఇంకా చిన్నవాడే గదమ్మా! వాడికి అప్పుడే మోపెడ్ ఎందుకులే! ఒక చిన్న సైకిల్ కొనిపెట్టు చాలు. వాడు అంతకన్నా ఇంకేమీ అడగడులే!" అన్నది. సంతోషంగా ఉన్న వాతావరణం ఒక్క క్షణం అంతు తెలియని నిశ్శబ్దంగా మారిపోయింది.

ఎప్పుడో పాతికేళ్ళ క్రిందట శంకరరావు. సౌభాగ్యమ్మ పేరుతో 50 వేలకు ఇన్స్యూర్ చేశాడు. అది ఈ సంవత్సరం మెచ్యూర్ అయి డబ్బు రావాలి. శంకరరావు చాలా రోజులుగా దాన్ని గురించే ఆలోచిస్తున్నాడు. ఆ డబ్బు వస్తూ దాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చెయ్యాలి, ఎక్కడ వేస్తే ఎక్కువ లాభం వస్తుంది. తమ ఆదాయం ఎంత పెరుగుతుంది. కొన్నాళ్ళుగా ఇవే అతని ఆలోచనలు. ఇప్పుడు హఠాత్తుగా కూతుళ్ళ మాటలు వినేసరికి అతనికే భయం పట్టుకుంది. పేపర్లు మడిచి భయంగా సావకాశంగా భార్య ముఖం చూస్తూ కూర్చున్నాడు. ఆవిడ తొందరపడి ఏం చెబుతుందో, ఏం మాట ఇస్తుందోనని కంగారుపడుతూ! తను రిటైరై అప్పుడే ఆరేళ్ళవుతోంది. ఇంక మరి ఇంట్లో తనకూ భార్యకూ ఇద్దరికీ వయస్సు పెరుగుతోంది. ఇంక బయట మార్కెట్లో ధరలు పెరుగుతూనే ఉన్నాయి గానీ తగ్గటం లేదు గదా! తృణమో పణమో దాచుకోలేకపోతే, ఎలాగ, సుఖంగా బ్రతకాలని అనుకోటంలో తప్పు లేదుగా, వయస్సు దిగజారుతున్న కాలంలో! ఏమీ అనలేక భార్యకేసి నిదానంగా చూస్తూ ఉండిపోయాడు.

సౌభాగ్యమ్మ విర్భాంతపోయింది. ఆవిడకి ఎప్పుడో భర్త తన పేరుతో ఇన్సూర్ చేశాడని తెలుసు. కాని అది ఎంతకో ఎప్పుడు వస్తుందో ఏమీ తెలియదు. డబ్బుకు సంబంధించిన విషయాలన్నీ శంకరరావే చూసు కుంటాడు. ఆవిడ ఏమీ పట్టించుకోదు. అసలు ఆ ఇన్స్యూర్ చేసిన విషయమే ఆవిడ మరిచిపోయింది. కూతుళ్ళు చదువుకున్నారు గదా! బాగా జ్ఞాపకం పెట్టుకున్నారు. అసలు ఈ సంవత్సరం పిలవకుండానే పండగకు వస్తాననడం ఇందుకే కాదు గదా!

ఏం జవాబు చెప్పాలి? ఒక్క క్షణం నివ్వెరపోయినా అంతలోనే తేరుకుని అనుకోకుండా అనేసింది. "అదా! అది ఎప్పుడో వచ్చేసింది గదా! మన బ్యాంకు మేనేజరు సుబ్బారావుగారు లేరూ? ఆయన చెప్పారు. ఆ డబ్బు అలాగే బ్యాంకులో వేసేసి ఇంకో ఏడేళ్ళు అలాగే ఉంచితే రెట్టింపు అయి వస్తుందిట! అలాగే వేసేశాను. నాన్నకు కూడా చెప్పలేదు" బిక్క మొహంతో భర్తకేసి చూసింది. ఆయన కలత తొలగి సంతోషంగా భార్యకేసి చూశాడు, ఆవిడ తెలివితేటలకి, సమయస్ఫూర్తికి మెచ్చుకుంటూ! మళ్ళీ పేపర్ల కట్టలో తల దాచుకున్నాడు.

అసలు విషయం, ఆ డబ్బు ఇంకా రానే లేదు. బ్యాంక్ మేనేజరు సుబ్బారావు ట్రాన్స్‌ఫర్ అయి ఈ ఊరి నుంచి వెళ్ళిపోయి, అప్పుడే నాలుగు నెలలయింది. అయినా అంత అబద్ధం అనుకోకుండా ఎలా చెప్పిందో ఎందుకు చెప్పిందో ఆవిడకు తెలియదు. ఆలోచించుకోటానికి టైమ్ లేనప్పుడు ఆ ఒక్క క్షణం ఎందుకో అలా తోచింది. అలా చెప్పే సింది! ఆ తరువాత అమాయకంగా చూస్తూ కూర్చుంది!

ఒక్క క్షణం ముగ్గురు అమ్మాయిలూ ఆశలతో ఆకాశాన్ని అందు కున్నారు. మరుక్షణం మామూలుగా అయిపోయినారు వాళ్ళేమీ అనవసరమైన ప్రశ్నలు వేసి ఆరాలు తీసేటంతటి మూర్ఖులు కారు. అమ్మా నాన్న మీద ప్రేమలేని వాళ్ళూ కాదు. అందుకే సర్దుకున్నారు.

డబ్బు మీది కాంక్ష అందరి మనస్సులను ఒక్క క్షణం రకరకాలుగా ఊపింది. సహజమైన స్వభావానికి విరుద్ధంగా కదిలింది. అంతలో ఉప్పొంగి పైకి లేచి, మళ్ళీ అంతలో విరిగిపడి ప్రశాంతంగా అణగిపోయి అలలా నిలిచింది.

పండగ ముగిసి అందరూ వెళ్ళిపోయారు. అందరూ సంతోషంగానే టాటాలు చెపుతూ కబుర్లు చెపుతూ సాగిపోయారు. శంకరరావు, సౌభాగ్యమ్మ మళ్ళా మామూలు అలవాట్లలో పడిపోయారు.

పండగ వచ్చింది, వెళ్ళింది, మళ్ళీ జీవితం మామూలే! ❑



## వందో పుట్టిన రోజున కలిసిన కూతురు!

కథ కన్నా జీవితం చిత్రమైనది. లొవిల్లా వీవర్‌కి మూడో కూతురు పుట్టింది. 1918లో అమెరికాలోని మోన్ హెగన్ ఐలాండ్‌లో, ఇద్దరు కూతుళ్లు చాలనుకున్న ఆమె భర్త మూడో కూతుర్ని అమ్మేశాడో అవివాహితకి. లొవిల్లా భర్తకు విడాకులిచ్చేసింది ఆ కోపంతో. ప్రయివేట్ డిటెక్టివ్‌లని పెట్టి వెదికించినా ప్రయోజనం లేకపోయింది. ఆ మూడో కూతురు జియాన్నే 18వ ఏట ఆమె పెంపుడు తల్లి మరణించింది. కానీ జియన్నే తన అసలు తల్లి గురించి తెలిసినా, తనని వదిలించుకునేందుకు అమ్మేసిందన్న కోపంతో చూడటానికి ప్రయత్నం చెయ్యలేదు. ఏళ్లు గడిచాయి. 73 ఏళ్ళదయ్యింది. అప్పుడనిపించింది అక్కయ్యలని చూడాలని. వాళ్లని ట్రేస్ చేసి కనుక్కొని అసలు నిజం తెలుసుకుని తల్లి వందో పుట్టిన రోజున ఆమెను కలుసుకుంది. 'ఇక నేను నిశ్చింతగా మరణిస్తాను' అంటోంది లొవిల్లా.

- డి. పద్మజ